వడగాడ్పు

అబ్దుల్ ఖాదర్ బుసలు కొడుతూ ఆ సందు మొదట్లో తన స్నేహితులతో నిలబడ్డాడు. అందరి చేతుల్లో బారెడు బారెడు కర్రలున్నాయి. మనిషి అలికిడయితే చాలు కర్రలు లేపుతూ తల పగిలేటట్టు కొట్టటానికి సిద్ధంగా ఉన్నారు.

రాత్రి పన్నెండు గంటలు దాటింది.

ఎవరూ సందులో అడుగుపెట్టలేదు.

అబ్దుల్ ఖాదర్ స్నేహితులు తమ ప్రయత్నమంతా వృథా అయిందని అసహనంతో కాలు కాలిన పిల్లుల మాదిరిగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఒంటిగంట దాటిన తరువాత ఒక్కొక్కళ్లే కళ్లు నులుపుకుంటూ నిద్రలోకి జారుకున్నారు.

ఆ మరునాడూ మూడోనాడూ కూడా అలాగే జరిగింది.

''మన ముందర వాళ్ల ఆగలేరు.'' క్రాపు వెనక్కు తోసుకుంటూ అన్నాడు అబ్దుల్ ఖాదర్.

''వాళ్లను తుక్కు తుక్కు చేశాము ఆ రోజు. వాళ్లవైపు నిలబడిన వాళ్లంతా దవాఖానాలో ఉన్నారు'' బీడీ వెలిగించాడు వహీద్.

''ఒకరికి చెయ్యి మెలిక పెట్టేశాను. ఆ చెయ్యి ఇంక రాదు'' అన్నాడు ఖాదర్ మిత్రుడొకడు.

''ఇళ్లన్నీ కాలిపోయాయి. ఇప్పు డావాడలో ఎవరూ లేరు'' అన్నాడు మరొక మిత్రుడు.

''నిజమా? అక్కడెవరూ లేరా? అన్ని ఇళ్లు కాలిపోయాయా?'' అబ్దుల్ ఖాదర్ ఆశ్చర్యపడ్డాడు.

"మిగిలింది బూడిదా మొండిగోడలా" తన సాహస కృత్యాలను వర్ణించి వర్ణించి చెప్పాడు మిత్రుడు.

"గుడ్డ ఉయ్యాలలో పడుకున్న పిల్లలు ఆ వేడికి నోరు తెరిచారు. అంతే. బలే కపి తీర్చుకున్నాంలే హ్హ హ్హ హ్హ" పడిపడి నవ్వాడు రహీమ్.

ఆ మహానగరంలో మారుమూలల్లో సందులూ గొందులూ ఎక్కువ. కొన్ని సందుల్లోకి రిక్షాలు పోలేవు. కొన్ని సందుల్లోకి వెళ్లినమనిషి వెనక్కు తిరగాల్సిందే కాని ముందుకు పోలేడు. మనిషి వెళ్లేదారి-లోపల అంగణం-చుట్టూ ఇళ్లు అంతే. అందరూ ఇళ్ల ముందర పడుకునో-కూర్చునో ఉంటారు. కొందరు చీట్లాడుతూ ఉంటారు. ప్రతి యింటి గడప ముందూ గోనె పట్టా కట్టి ఉంటుంది. బజారు పంపు నుంచి మగవాళ్లు నీళ్లు తెచ్చి లోపల కుండల్లో పోస్తారు. కొన్ని ఇళ్లల్లో ఆడవాళ్లు ఏవో చేతిపనులు చేస్తారు. మగవాళ్లు కొందరు దుకాణాలల్లోను విడిగానూ పనులు చెయ్యటానికి బైటికి వెళ్తారు.

ఏదో ఒక కారణంచేత ఆ ఇరుగు పొరుగు సందుల్లో నివసించే రెండు తెగలవారికీ అప్పుడప్పుడు తగాదా వస్తుంది. వెంటనే లోపల ఉన్న బల్లేలు బాడిసలూ లారీల చక్రాలూ బయటికి తీస్తారు. కొందరికి దెబ్బలు తగుల్తాయి. కొందరికి కాళ్లూ చేతులూ విరుగుతాయి. ఒకరిద్దరి ప్రాణాలుపోతాయి. ప్రభుత్వము వెంటనే కర్ఫ్యూ పెడుతుంది. ఇటువంటి సంఘటనలు వివిధ జాతులూ మతాలూ ఉన్న ఆ నగరంలో నిత్యకృత్యాలు.

ఆ మొహల్లాలో వీటికి నాయకుడు అబ్దుల్ ఖాదర్. అతడికి సైదోడుగా ఏభయిమంది వరకూ సైన్యము.

ఎదురు చూసినప్పుడు ఇటువంటి సంఘటనలు జరగవు అనుకోకుండానే మాట మీద మాట పెరిగి కక్షలూ కార్పణ్యాలూ బయలుదేరుతూ ఉంటాయి. అలాగే ఒకనాడు-ఏదో చిన్నమాట "దారి కడ్డం లే" అన్న మాటమీద "నేను జరగను. ఏం చేస్తావో చెయ్యి" అనటంతో ఆరంభమయి-ఇద్దరల్లా నలుగురయి పది మంది అయి-ఆ వాడంతా పోగయి కర్రలెత్తిన సంఘటనతో తగాదా వారంరోజులపాటు సాగింది. పర్యవసానంగా ఒక గుంపులో నలుగురికి దెబ్బలు తగిలాయి. ఒకరు మరణించారు. మరొక గుంపులో ఇళ్లు కాలాయి. పసిబిడ్డలిద్దరు మరణించారు.

సరిగ్గా ఈ సంఘటన జరిగిన తరువాత-మూడో నాడు-దీప దీపాలవేళ-పాతికేళ్ల యువకుడొకడు సందుముందరగా పోవటం తటస్థించింది. అతడికి అబ్దుల్ ఖాదర్‌తో పని ఉంది. అతడా రోజు పగటి వేళకే రావాలనుకున్నాడు. కాని చేతిలో ఉన్న పని తెమల్లేదు. ఇరవై మైళ్ల దూరంలోఉన్న గ్రామాన్నుంచి గంట క్రిందట తిరిగి వచ్చాడు. రాగానే అబ్దుల్ ఖాదర్ మాట జ్ఞాపకానికి వచ్చింది.

అబ్దుల్ ఖాదర్ ఆవేళప్పుడు ఇంట్లో ఉంటాడో లేదో తెలయదతనికి. అస లింతవరకూ అతడు అబ్దుల్ ఖాదర్ ఇంటికి వెళ్లలేదు. ఆ ప్రాంతంకూడా అతడికి సరిగా తెలియదు. అబ్దుల్ ఖాదరే ఎప్పుడో చెప్పాడు-తన యింటి గుర్తులు చెప్పి ఎన్నిసార్లో రమ్మని పిలిచాడు స్నేహితుడిని ఆప్యాయంగా.

''నేనెన్నిసార్లు వచ్చాను? నీవొక్కసారి రావటానికి బెట్టు చేస్తావేం?'' అంటూ తగవులాడుతూ పిలిచాడు.

''వస్తాలే'' అంటూ వాయిదాలు వేశాడతడు. అతడికి ఇప్పుడు రావటానికి వీలు చిక్కింది.

ఆ పిలుపయినా మామూలుగా పిలిస్తే మళ్ళీ వాయిదావేసే వాడేమో? కాని - చాలా రోజుల తరువాత అబ్దుల్ ఖాదర్‌కు ఒక పాప పుట్టింది. నలభై రోజులు దాటింది. ఆ బిడ్డను చూడటానికి రమ్మని పిలిచాడు. తానొక్కడయినా వెళ్లాలని ఆదీకాక అతడి భార్య రామ్మోహన్ తల్లిని ఇంటికి తీసుకురమ్మని బాధిస్తోంది. ఇక వాయిదా వెయ్యటానికి వీలుకాకపోయిందతడికి

ఆ మధ్య-ఇద్దరూ పదేళ్ళ తరువాత విచిత్రంగా ఒక హోటల్లో కలుసుకు న్నారు ఒక టేబుల్ దగ్గర.

'అవునా కాదా' అనుకుంటూనే అబ్దుల్ ఖాదర్ పలకరించాడు. రామ్ మోహన్ను.

ఆశ్చర్యంతో గతాన్ని జ్ఞాపకం తెచ్చుకుని "అవును నేను నిన్ను గుర్తు పట్టటానికి వీల్లేకుండా మారిపోయావు.'' కళ్ళు పెద్దవి చేసుకుని అబ్దుల్ ఖాదర్‌ను చూస్తున్నాడు రామ్‌మోహన్.

"ఎట్లా? ఎట్లా?" కళ్లు మూసుకుపోయేటట్టు శరీరమంతా కదిలేటట్టు నవ్వే వాడు అబ్దుల్ ఖాదర్.

"ఎట్లాగా? నీ రంగు తగ్గింది. బాగా లావయ్యావు. కళ్లు పూడిపోయాయి" అన్నాడు. భుజమ్మీద చెయ్యేస్తూ.

"నిన్ను గుర్తుపట్టటానికేం కష్టంలేదు. అప్పటిలాగే ఉన్నావు. చూడగానే గుర్తుపట్టాను. ఉద్యోగం చేస్తున్నావా? ఎక్కడ?" కుర్చీ దగ్గరికి లాక్కున్నాడు. అబ్దుల్‌ఖాదర్.

"ఏదో చిన్న ఉద్యోగం దొరికింది. గ్రామాలు తిరిగాను. ఇంట్లో చదివి ఇక్కడికి వచ్చి పరీక్షలు రాశాను. బి.ఏ అనిపించుకున్నాను" తనకు తగిన ఉద్యోగం లేదని కాస్తయినా బైటపడలేదు రామ్మోహను. "మరి-నీవేం చేస్తున్నావు?" అడిగాడు.

"నేనా?" గడ్డం తడుముకున్నాడు అబ్దుల్‌ఖాదర్. "దుకాణం పెట్టాను" అన్నాడు.

"అప్పటి పరీక్ష మళ్ళీ రాశావా?"

"పరీక్షా? లేదు బాబా. మళ్ళీ దాని జోలికి పోలేదు. చూడు రామ్! చదివితే ఏదో ఒక ఉద్యోగం వస్తుందనుకో. కాని-హాయిగా దర్జాగా దుకాణంలో కూర్చున్నట్టుంటుందా! మనమీద ఒకడు అధికారం చేయటం నాకు నచ్చదు. మనకు మనమే యజమానులం అన్నట్టుగా మహారాజులా కాలిమీద కాలువేసుకుని కూర్చుంటే అదొక దర్జా. ఏమంటావు?"

అబ్దుల్‌ఖాదర్ తృప్తి కోసం నవ్వినట్టుగా నవ్వాడు రామ్‌మోహన్. అతడికి అబ్దుల్‌ఖాదర్‌ను ఒకమాట అడగాలనిపించింది. తను పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరు పుట్టారు. అతడూ తన ఈడువాడేం కాదు-ఏళ్ళకు పెద్దే. అడిగితే తప్పేముంది? కాని-అడగలేదు.

"చూడు రామ్ ఆ పల్లెటూళ్ళో ఏముంది? అక్కడెట్లా ఉండగలుగుతున్నావు? ఇక్కడికి బదిలీ చేయించుకో" భుజమ్మీద గట్టిగా చరిచాడు. అబ్దుల్ ఖాదర్‌కు సంతోషం ఎక్కువయితే చురుక్కుమనేటట్టు వీపుమీద చరచటంఅలవాటు.

"చంపేశావు ఖాదర్. నీకింకా ఈ అలవాటు పోలేదుకదూ?" భుజం పట్టు కుని బాధపడుతూ నవ్వేశాడు రామ్‌మోహన్.

"నేను ఆ పల్లెటూళ్ళో సుఖంగా ఉన్నాను. ఆ జీతమక్కడ హాయిగా గడిచి పోతుంది. పిల్లలకు జబ్బుచేస్తే కొద్ది ఖర్చుతో వైద్యం జరిగిపోతోంది. అదే ఇక్కడయితే వందలు కావాలి."

"అరే పిల్లలా నీకు? చెప్పవేం అప్పటినుంచీ? ఎంతమంది? ఎన్నేళ్ళు?" కళ్లు గుండ్రంగా తిప్పుతూ ఆఁహాఁ అన్నట్టు చూశాడు.

"అదేమంత వింత సంగతనీ చెప్పటానికి? అతి సామాన్యమైన విషయం. ఒక ఆడ-ఒక మగ. నాలుగూ రెండేళ్ళు." చిన్నగా నవ్వాడు.

"అదే గొప్ప భాయీ. అదిలేకపోతే పెద్దలోపము. నాకోసారి చూపిం చవు?" ఆశతో అడిగాడు.

"ఎట్లా? నీవిక్కడ-నేనక్కడ"

"ఒక్కసారి తీసుకురావా?" అర్థించాడు అబ్దుల్‌ఖాదర్. వాళ్ళు కలుసు కోని ఈ పదేళ్ళలో జరిగిన సంగతులన్నీ ఇద్దరూ హోటల్ ముందున్న గట్టుమీద కూర్చుని చాలాసేపు చెప్పుకున్నారు. ఆత్మీయతను తిరగతోడుకున్నారు.

విద్యార్థి దశలో వాళ్ళిద్దరూ అనుకోకుండా మొదటిసారి కలుసుకున్నారు.

స్కూలు విడవగానే విద్యార్థులు గుంపులు గుంపులుగా బయటికి వచ్చి మాట్లాడుతున్నారు. రామ్‌మోహన్ చుట్టూ పిల్లలుచేరి అతడిని అభినందిస్తున్నారు.

"చాలా అదృష్టవంతుడివోయ్. నిరుడూ క్లాసుకు ఫస్టు వచ్చావు"

"ఈ సంవత్సరం నుంచీ నేను నీ దగ్గరికి వచ్చి చదువుకుంటాను"

రామ్‌మోహన్ భుజాలమీద చేతులువేసే వాళ్లూ, నడుమ్మీద చేతులువేసేవాళ్లూ. అతడికి ఎదురుగా వచ్చేవాళ్లూ, వెనకనుంచి మాట్లాడేవాళ్లూ గుంపుగా చేరారు.

కొంతసేపటికి అందరూ విడిపోయారు.

''నీ పేరేమిటి? ఏ క్లాసు చదువుతున్నావు?'' ఈ మాటలు విన వచ్చిన వైపుకు తిరిగాడు రామ్మోహన్. ఆ స్కూలు కాంపౌండు చాలా పెద్దది. కాంపౌం డులో పెద్దపెద్ద వేపచెట్లూ గానుగచెట్లూ ఉన్నాయి వేపచెట్టు నానుకుని నిలబడి చాలాసేపటినుంచీ రామ్‌మోహన్ను గమనిస్తున్న అతడు ముందుకు నడిచి వస్తు న్నాడు ఠీవిగా.

''నా పేరు రామ్మోహన్. ఇక్కడే తొమ్మిదోక్లాసు చదువుతున్నాను. నీవు కూడా ఇక్కడేనా?'' అతడికి ఆ స్కూలు విద్యార్థులంతా బాగా తెలుసు. ఇత డెవరో కొత్తగా వచ్చాడనుకున్నాడు.

హ్హా హ్హా హ్హా అంటూ బిగ్గరగా నవ్వుతూ రామ్‌మోహన్ భుజం చరిచాడు.

''నేను ఈ స్కూలు వాడిని కాను. సెంట్‌జాన్ హైస్కూల్లో తొమ్మిదో క్లాసు చదువుకుంటున్నాను-మూడేళ్ళనుంచీ. మా స్నేహితుడొకడు ఈ స్కూల్లో ఫస్టు వచ్చిన 'స్టూడెంటు ఉన్నాడని చెబితే చూడాలని వచ్చా''

అతడు తెల్లగా బొద్దుగా ఉన్నాడు. ఇరవై ఏళ్లు ఉన్నట్టు కనబడతాడు. తెల్లటి పాయజామా దానిమీద తెల్లటి షర్టు మెడలో ఎర్రటి స్కార్ఫు ముడివేసు కున్నాడు. అతడు నవ్వుతున్నా ఒళ్లు జలదరిస్తుంది. కాని-కోరగా చూపినా అతడి కళ్లు నవ్వుతూ ఉంటాయి.

ఇద్దరూ బయటికి నడిచారు-భుజాలమీద చేతులు వేసుకుని. చెరొక సోడా తాగారు.

చప్పున జేబులో చెయ్యిపెట్టి పర్సు బైటికి తీశాడు అబ్దుల్ ఖాదరు.

తను ఇవ్వలేకపోయినానని మనసులో బాధ కలిగింది రామ్మోహనుకు ''రేపు నేనిస్తాను లేవోయ్'' అంటూ సోడా బండి రామయ్యకు చెప్పి ముందడుగు వేశాడు.

అబ్దుల్ ఖాదరు అందుకు ఒప్పుకోలేదు పర్సు తెరిచి డబ్బు ఇచ్చాడు. తరువాత చాలా సేపు రామ్మోహన్ అతడి స్కూలును గురించీ అతడిని గురించీ అడిగి తెలుసుకున్నాడు. ఆ క్షణం నుంచీ ఇద్దరి మధ్య స్నేహ భావం కలిగి దృఢంగా అల్లుకుపోయింది.

"అయితే నేను ఈ స్కూల్లో చేరిపోతాను. ఇద్దరంకలిసి చదువుకోవచ్చు" అన్నాడు అబ్దుల్ ఖాదర్.

"ఏం ? ఆ స్కూలు బాగుండలేదా ?"

"ఏం బాగుంది ? మూడేళ్ల నుంచీ పై క్లాసులోకి రాలేకపోతున్నా."

"మీ యింటికి దూరమేమో కదూ ? ఎట్లా వస్తావు ?" మామూలుగా అడిగాడు రామ్మోహన్.

"నాకు సైకిలుందిగా ?" ధీమాగా తలెగరవేస్తూ అన్నాడు.

అలా ఒకరికొకరు సన్నిహితులై తిరుగుతూ ఉండేవారు. అబ్దుల్ ఖాదర్ మాట్లాడితే రామ్మోహన్‌కు నవ్వు వచ్చేది. అతడికి తెలుగు భాష సరిగా రాదు. తోడి విద్యార్థుల దగ్గర కొంత-తమ వాడలో పాటక జనం దగ్గర నేర్చినది కొంత కలిపి మాట్లాడుతూ ఉంటాడు. ఆ మాటల్లో చాలా వరకూ ఉరుదూ భాష అతడికి తెలియకుండా దొర్లుతూ ఉంటుంది. ముందు మాట వెనకా-వెనక మాట ముందూ అంటాడు. తన భాషను తెలుగులోకి అనువదించి మాట్లాడేవాడు.

"విన్న ఇద్దువులే" అంటా డొకసారి.

"నేపు ఎందుకు రాలే ?" అంటా డొకసారి.

ఈ మాటలు విని తోడి పిల్లలంతా పగలబడి నవ్వేవారు. కాని-రామ్మోహన్ వాళ్లను కళ్లతో వారించేవాడు.

"వాళ్ల భాష మనమింత సులభంగా మాట్లాడగలమా? అతడే నయం. ఎలాగో మాట్లాడగలుగుతున్నాడు" అని సమర్థించేవాడు.

రామ్మోహన్ మాటలకు అందరూ వెనక్కు తగ్గేవారు.

స్కూల్లో విద్యార్థులంతా అబ్దుల్ ఖాదరు ఒంటరిగా ఉన్నప్పుడు ఒకడుగు వెనక్కు వేసేవారు కొందరు అతడిని చూసి పక్కకు తొలగిపోయేవారు.

చదువు విషయంలో రామ్మోహన్ మిత్రుడికి చాలా సహాయం చేసేవాడు.. పుస్తకాలు చదువుకోనక్కరలేకుండా నోట్సు వ్రాసిచ్చేవాడు.

అబ్దుల్ ఖాదర్ మిత్రుడికి తనమీదగల అభిమానాన్ని గుర్తించి గౌరవమూ ఆదరమూ చూపేవాడు. కాని ఆ నోట్సు ఇంటికి తీసుకువెళ్లి పుస్తకాల అడుగున పడేసేవాడు. పరీక్షల ముందర ''బాగా చదివావా ?'' అని అడిగితే చదివానన్నట్టు తల ఎగరవేసేవాడు. వాటిలో ఏదయినా ఒక ప్రశ్న అడిగితే ''రేపు చెబుతాలే'' అనేవాడు.

''సరేలే రేపడుగుతాను జవాబు చెబుతావా ?'' అంటే సరేనని అప్పటికి తప్పించుకుని ఆ మరునాడు కనబడేవాడు కాదు

అనుకోకుండా రామ్మోహన్‌కు నగరానికి బదిలీఅయింది. తన ఆఫీసు పేరు వ్రాసి తనకు అక్కడికి బదిలీ అయిందని అబ్దుల్ ఖాదర్‌కు ఒక కార్డు రాశాడు రామ్మోహన్. తన ప్రాణం తిరిగి వచ్చినట్లనిపించింది అబ్దుల్ ఖాదర్‌కు. తీరిక చేసుకుని ఆఫీసుకు వెళ్లి కలుసుకున్నాడు ఒకటే కబుర్లు-కాసేపట్లో ఇద్దరుమిత్రులూ పదేళ్ల కబుర్లు మళ్లీ మళ్లీ చెప్పుకున్నారు.

ఆఫీసు టైమయింది ఇద్దరూ లేచారు.

రామ్మోహన్‌కు ఇంటికి పోవలసిన తొందర ఉన్నది. తనకు మూడో సంతానం కలిగి రెండు రోజులు తక్కువగా నెలయింది. ఆ రోజు తండ్రి తద్దినం. తను తద్దినం పెట్టగానే ఆఫీసుకు వచ్చాడు. ఇంటి పని తల్లి ఒక్కతే చెయ్యలేదు. తను వెళ్లి కొంతయినా ఆమెకు సహాయపడాలి.

కాని-అబ్దుల్ ఖాదర్ విడిచిపెట్టేటట్టులేడు.

''ఏం ? అట్లా ఆలోచిస్తున్నావు ?'' రోడ్డుమీదికి వచ్చిన తరువాత అడిగాడు అబ్దుల్ ఖాదర్.

ఇంటి సంగతులన్నీ విడమరిచి చెప్పాడు రామ్మోహన్.

''రామ్ నేను మీ యింటికి వచ్చి ఆ పాపను చూస్తా'' సరదా పడ్డాడు. అబ్దుల్ ఖాదర్.

తనది చిన్న ఇల్లు. తను కొద్ది జీతగాడు. ఇంట్లో కూర్చోటానికయినా ఒక మంచి కుర్చీలేదు. కాస్త సంకోచించాడు రామ్మోహన్.

"అట్లా చూస్తున్నావు. నేను రావద్దా?" గునిసినట్టు ముఖం పెట్టాడు అబ్దుల్ ఖాదర్.

"ఏం లేదు. పోదాంపద" అబ్దుల్ ఖాదర్ సైకిల్ మీద ఇద్దరూ వెళ్లారు. ఒక చిన్న సందులో సైకిల్ ఆగింది. రామ్మోహన్ అతడికి దారి చూపిస్తూ ఒక చిన్న అరుగు ముందర నిలబెట్టి లోపలికి వెళ్లాడు. ఈతాకుల చాప తెచ్చి అరుగు మీద పరచాడు

"కూర్చో ఇప్పుడే వస్తా" నంటూ లోపలికి వెళ్లి ఒక విస్తరితో గారెలు పాయసం పెట్టి అతడి ముందుంచాడు.

"ఖాదర్ ఇవి నీకిష్టముంటాయోలేదో? మా యిళ్లల్లో తద్దినమంటే ఇవి ఉండాలి" మంచి నీళ్ల గ్లాసు చేతికిచ్చాడు రామ్మోహన్.

చెయ్యి తుడుచుకుని జేబులో ఉన్న పాన్ వేసుకుంటూ "మీ అమ్మగారిని నేను చూడాలి దణ్ణం పెట్టాలి. కొత్తగా పుట్టిన పాపను తీసుకురా" విస్తరాకు అవతల పడేసి సర్దుకుని కూర్చున్నాడు.

రామ్మోహన్ తల్లి పాపను తీసుకువచ్చింది.

"బాబూ నీకు తెలుగు మాట వచ్చునా?" అంటూ పలకరించింది ఆమె.

ఆమె పలకరింపులో అతడికెంతో అప్యాయత గోచరించింది. ఆమె రోజూ రామ్‌ను యిలాగే పలకరిస్తుందా? ఇంత తియ్యగా అతడితో మాట్లాడుతుందా? రామ్ రోజూ ఇంత తీపిని తింటాడా? అందుకే రామ్ అట్లా ఉన్నాడా?

అబ్దుల్ ఖాదర్ దిగ్గున లేచాడు. ఆమె కాళ్లమీద చేతు లానించి ముఖానికి అద్దుకున్నాడు. పాపను తన చేతుల్లోకి తీసుకున్నాడు. పసిపాప చేతులూ, కాళ్లూ ముఖం నిమురుతూ పదిరూపాయల కాగిత మొకటి చేతిలో పెట్టాడు.

అదిరిపడ్డట్టు చూసి "ఆదెందుకు?" అన్నాడు రామ్మోహన్.

"భాయీ నాదీవెన అది. మంచి డ్రెస్సు కుట్టించు" అన్నాడు.

రామ్మోహన్ అతడి అప్యాయతకు ఎంతో సంతోషించాడు తన కటువంటి మిత్రుడున్నందుకు ఎంతో గర్వంగా చూశాడు మిత్రుడా అతడు? కాదు-తన తోబుట్టువు

సరిగ్గా ఈ పాపను చూసిన ఏడాదికి అబ్దుల్‌ఖాదర్‌కు ఒక ఆడపిల్ల పుట్టింది. పేరుపెట్టి పెద్ద పండుగ చేసుకున్నాడు.

తన కత్యంత ఆప్తమిత్రుడు ఆహ్వానించినందుకు తను వెళ్ళి తీరాలన్న పట్టుదలతో అద్దెసైకిల్ తీసుకుని బయలుదేరాడు రామ్మోహను. నెలారంభములోనే కనుక ఇంటి ఖర్చులు పెట్టకముందు అబ్దుల్‌ఖాదరు పాపకు ఒక మంచి గౌను పది రూపాయలకంటె ఎక్కువ ధరదే కొని ఆ పొట్లం చేతిలో పట్టుకున్నాడు.

అప్పటికి ఏడున్నర దాటింది. వీధి దీపాలు కాంతివంతంగా లేవు. కర్ఫ్యూ పెట్టారు. కనుక పోలీసు చూడకుండా ఒకటీ రెండూ సైకిళ్లు రోడ్డుమీద నడుస్తునే ఉన్నాయి. అబ్దుల్‌ఖాదర్ దుకాణంతప్ప ఇంటి అడ్రసు బాగా తెలియదు రామ్మోహన్‌కు. ఒకటి రెండుచోట్ల సైకిల్ దిగి అడిగాడు. ఆ సందు మొదట్లో మనుష్యులు కనబడగానే మళ్ళీ సైకిల్‌దిగాడు ఇంటి అడ్రసుకోసం.

ఒకటి కాదు... పదిలాఠీలు ఒక్కసారి అతడి తలమీద పడ్డాయి.

అమ్మో అంటూ నేలకొరిగాడు. కాని అతడిచేతిలో ఉన్న పొట్లము కింద బడలేదు.

"చచ్చాడులే ఇంక కళ్లు తెరవడు" అని నవ్వుకుంటున్నారు అబ్దుర్‌ఖాదర్ మిత్రులు.

కర్ఫ్యూ పెట్టాంకదా అని పోలీసు ఆ చౌరస్తామీద ఎక్కడో దూరంగా ఉన్నారు.

రోడ్డుమీద కాక-ఇళ్ళగోడల కానుకుని నీడలా నడుస్తూ వస్తున్నాడు అబ్దుల్‌ఖాదర్. సందుమొదట పడిఉన్న మనిషిని చూశాడు. శబ్దం కాకుండా నవ్వుకున్నాడు. మళ్ళీ అంతలోనే టార్చివేసి చూశాడు, బతికి ఉన్నాడా లేదా అనుకుంటూ.

నేలమీదపడిన అతడికి తలలోనుంచి రక్తం కారుతున్నది. కళ్ళు సగం మూతలుపడ్డాయి. చేతిలో పొట్లం తీసిచూశాడు,

చిన్న పాప కొాక గౌను,

మళ్ళీ ముఖమ్మీద టార్చివేసి చూశాడు. గుండెలదిరిపోయాయి.

"రామ్ రామ్ నా పాపకు గొను తెచ్చావా! నా మిత్రులే నిన్ను చంపేశారా? అమ్మకు నా ముఖ్యం ఎలా చూపించను?" రామ్మోహన్ గుండెకు తలానించి ఏడ్చాడు.

"ఖాదర్" అన్నట్టు రామ్మోహన్ లోగొంతుకలో నుంచి పిలుపు విన వచ్చింది.

"అమ్మ అమ్మ ఏడుస్తుంది. పిల్లలకు దిక్కులేదు. నీవే నీవే...." మాట స్పష్టంగా వినబడలేదు అబ్దుల్‌ఖాదర్‌కు.

"రామ్ నీవు నా ప్రాణం- వాళ్లు నా బిడ్డలు. ఆమె నా తల్లి." అతడి చేతిని కళ్ళకద్దుకున్నాడు.

అబ్దుల్‌ఖాదర్ తన మిత్రులను పేరుపేరునా పిలిచి నోటికి వచ్చినట్టు తిట్టి ఇంక తన కంటికి కనబడవద్దన్నాడు. ముఖం కళ్లూ వాచిపోయేటట్లు ఏడ్చాడు.

రామ్ ప్రాణాలతోపాటు తన ప్రాణాలు కూడా పోతున్నట్లనిపించి 'అల్లా అల్లా' అంటూ అతడిపక్కనే తలమీద చేతులు పెట్టుకుని చతికిలపడ్డాడు అబ్దుల్‌ఖాదర్.